కథ

# నిజం

## కొమ్మూరి రవికిరణ్

**ఫ్యామిలి కోర్టు.**
**కోర్టు హాలంతా జనంతో కిక్కిరిసి పోయింది.**
**బయట సరేసరి ఇంకా కొంత మంది జనం.**
**టీవీ రిపోర్టర్స్, ప్రెస్ వాళ్ళతో గందరగోళంగా వుంది అక్కడి వాతావరణం.**
**ఫ్యామిలీ కోర్టు నిత్యం ఏవో కేసులతో హడావిడిగానే వుంటుంది. కాని, ఆ రోజు మాత్రం అంతమంది జనంతో ఆ ప్రాంగణమంతా నిండుగా వుండటానికి కారణం లేకపోలేదు.**
**లోపల జరుగుతోంది...విడాకుల కేసు.**

అందులో అది మాములు వ్యక్తికి సంబంధించిన కేసు కాదు. అందరికి అభిమానమైన అందాల నటుడు కార్తికేయ విడాకుల కేసు.

మూడు నెలల క్రితం కార్తికేయ నుంచి విడాకులు కోరుతూ, హిందూ వివాహ చట్టం ప్రకారం క్రుయాలిటీ గ్రౌండ్స్ మీద పిటిషన్ దాఖలా చేసింది అతని భార్య గాయత్రి.

ఎన్నో కుటుంబ కథా చిత్రాలలో నటించి, మంచి ఇమేజ్ తెచ్చుకున్న కార్తికేయ విడాకుల కేసు పెద్ద సంచలనంగా తయారయ్యింది.

* * *

కోర్టు హాలులో ఓ ప్రక్క గాయత్రి నిలబడివుంది. ఆమె ముఖం అభావంగా శూన్యంలోకి చూస్తున్న ట్టుగా వుంది. ప్రక్కనే ఆమె తండ్రి నారాయణరావు.

ఇంకో ప్రక్క కార్తికేయ. అతని ముఖం భావరహితంగా వుంది. లోపల కూర్చున్న మిగతావాళ్ళంతా మాత్రం జడ్జిగారు ఏంచెబుతారా? అని ఆతృతగా ఎదురు చూస్తున్నారు.

కేసు మొదలయిన మొదటి రోజునుంచి చాలా మంది ఆసక్తికరంగా ఫాలో అవుతున్నారు. అందరికీ అంతుబట్టని విషయం ఏమిటంటే? కార్తికేయ తన తరపున వాదించడానికి లాయర్ని పెట్టుకోలేదు.

అందర్ని అయోమయంలో పడేసిన అంశం, కేసు విషయంలో కార్తికేయ మీద పెట్టబడిన అభియోగాలని అతను ఏ మాత్రం పెద్దగా ఖండించక పోవడం.

ఇది అతని అభిమానుల్ని చాలా నిరుత్సాహ పరిచింది.

జడ్జిగారు మాట్లాడారు "పూర్వాపరాలు, ఇరు పక్షాల వాదనలూ విన్న మీదట తీర్పు ఇరవై మూడవ తారీఖుకి వాయిదా వేస్తున్నాను." అని ముగించారు.

వున్నట్టుండి అక్కడ కలకలం మొదలయ్యింది. లోపల వున్నవాళ్ళంతా తమ అభిమాన నటుడి కేసి

ఎగబడ్డారు.

ఇది చూసి అక్కడే వున్న పోలీసులు అందర్నీ నెట్టి కంట్రోల్ చెయ్యసాగారు. ఈ లోపల కార్తికేయకి సంబంధించిన మనుషులు వచ్చి అతన్ని తొందరగా బయటకు తీసుకువెళ్ళారు.

గాయత్రి తండ్రితో పాటు బయటకు వచ్చింది. వస్తూనే తిన్నగా కార్లో కూర్చుని డోర్ వేసుకుంది.

టీవీ రిపోర్టర్స్, ప్రెస్ అంతా కార్తికేయని చుట్టేశారు. వాళ్ళకి ఏ మాత్రం అవకాశం యివ్వకుండా అతని మనుషులు అందర్నీ తోసేసి అతన్ని కారు దగ్గరకు తీసుకెళ్ళారు.

అందరూ నిరాశపడ్డారు.

అది గమనించి కార్లో కూర్చోబోతున్న కార్తికేయ వాళ్ళని దగ్గరకు పిలిచాడు. మీడియా వుత్సాహంగా అతని దగ్గరకు పరిగెట్టారు.

కార్తికేయ వాళ్ళని చూసి ''సారీ...యిప్పుడేం మాట్లాడలేను. ఓ మారు యింటికి రండి'' అని కారెక్కాడు.

''సార్...'' అంటూ అందర్నీ తోసుకుంటూ ముందుకు వచ్చాడు గాయత్రి తరపు లాయరు.

ఆశ్చర్యపోయాడు కార్తికేయ ''చెప్పండి?''

కుచించుకుపోతూ-అన్నాడు లాయర్ ''నన్ను క్షమించండి సార్''. నొచ్చుకున్నాడు కార్తికేయ. ''అయ్యో...మీరేం చేస్తారు? ఇది మీ వృత్తి. ఏం ఫీల్ కాకండి'' అన్నాడు చెయ్యి నొక్కి.

''నన్ను అర్థం చేసుకున్నారు. థాంక్యూ సార్ ''చెమ్మగిల్లిన కళ్ళతో అన్నాడు. కారు కదిలింది.

వెళ్తున్న కారు వైపే చూస్తున్న లాయరు దగ్గరకు వచ్చాడు నారాయణరావు. ''ఏంటయ్యా లాయరు? అతని దగ్గరకు వెళ్ళావేమిటి? కొంపతీసి నీకు మనం ఓడిపోతామని అనిపించిందా? మనం గెలుస్తామయ్యా''

విజయగర్వంతో అన్నాడు నారాయణరావు.

''నేను ఆయన అభిమానిని సార్. మనం కాదు సార్ గెలిచేది. ఆయనే మనల్ని గెలిపిస్తున్నారు. అందుకే ఆయన ఏ లాయర్ని పెట్టు కోలేదు. ఆయనే తలుచుకుంటే...'' ఆర్ద్రతతో ఆపేశాడు.

చేష్టలుడిగి చూస్తున్నాడు నారాయణరావు.

***

నారాయణరావు ఇల్లు.

డ్రాయింగ్ రూమ్‌లో అన్ని టీవీ ఛానల్స్ నుంచి రిపోర్టర్స్, పత్రికా విలేకర్లు, మీడియా అంతా అక్కడే వుంది.

వాళ్ళ ముందు సోఫాలో నారాయణరావు, అతని ప్రక్కన గాయత్రి కూర్చుని వుంది.

నారాయణరావు అన్నాడు ''అమ్మాయి చాలా అప్‌సెట్ అయ్యింది. ఎక్కువ ప్రశ్నలువేసి యిబ్బంది పెట్టకండి''

''కేసు నడుస్తున్నంత కాలం మీరు గాని, కార్తికేయగారు గాని ఎన్నిసార్లు అడిగినా చెప్పలేదు. ఇప్పుడయినా చెప్పండి మేడమ్..మీరు ఎందుకు విడిపోవాలనుకుంటున్నారు?''

దానికి సమాధానం నారాయణరావు చెప్పాడు

''ఏ స్త్రీ అయినా భర్త నుంచి ఎందుకు విడిపోవాలనుకుంటుందండి? అతని ప్రవర్తన నచ్చక. అతన్ని చేసుకుని మా అమ్మాయి ఒక్కరోజు కూడా సుఖపడింది లేదు. అతన్ని అందగాడనే చూసింది గాని, అతని మనసు, ప్రవర్తనా చాలా వికారమైందని తర్వాత తెలుసుకుంది.''

''అంటే...మిమ్మల్ని హింసించేవారా మేడమ్?''

గాయత్రి మాట్లాడింది ''శారీరకంగా హింసించినా సర్దుకుపోయేదాన్నేమో... ఎందుకంటే కొన్నాళ్ళకి ఆ గాయాలు మానిపోతాయి. ఆయన హింస మానసికమైంది. ఎప్పుడూ గాయపడేట్టు మాట్లాడ్డం. నిర్లక్ష్యంగా చూడ్డం. ఆయన ఏ రోజూ నాతో ప్రేమగా మాట్లాడింది లేదు. ఎప్పుడూ షూటింగ్స్‌తో బిజీ. ఇంటి కొస్తే ఫోన్లతో బిజీ. ఇంకా కొనసాగితే నా ఆత్మగౌరవం తగ్గేటట్టుగా వుంది. అందుకే యిలాంటి నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది.''


''అందుకే విడిపోవాలనుకుంటున్నారా? మీరు ఆయన్ని యిష్టపడే పెళ్ళి చేసుకున్నారు కదా?''

''ఆ కారణంగానే చులకనయిపోయాను. ఇంట్లో వున్నానన్న విషయమే మర్చిపోయారు. మాట్లాడే దానికి ఏమైనా వుంటే అది పోట్లాటకే దారి తీసేది. ఇంకా యిలాంటివి చాలా వున్నాయి. అవన్నీ పూర్తిగా వ్యక్తిగతం. విడిపోవాలని నేనేకాదు. ఆయన కూడా కోరుకుం టున్నారు''

''అది మీరు ఎలా చెప్పగలరు?

''లేకపోతే ఆయనంత ముఖా వంగా ఏ లాయర్ని పెట్టు కోకుండా వుండరు. కేసు తొందరగా క్లోజ్ చేద్దామన్న వుద్దేశ్యంతోనే ఆయనా పని చేశారు.''

''మీరు కోర్టులో



ప్రొసీడ్ అయిన తర్వాత కార్తికేయగారు ఒక్కసారయినా పర్సనల్‌గా మాట్లాడదామని ప్రయత్నించారా?''

''ఒకసారొచ్చారు. కోర్టుదాకా ఎందుకు? ఆయనే స్వచ్ఛందంగా రాసిస్తానన్నారు. అంతేకాని, ఆయన ప్రవర్తన మార్చుకుంటానని అనలేదు. ఆయన మారరని అర్థమైంది.''

''మీరు కావాలనే కార్తికేయగారి యిమేజ్‌ని దెబ్బతియ్యడానికే కోర్టుకు వెళ్లారని ఆయన అభిమానులు కొందరంటున్నారు. దీనిపై మీ కామెంట్?''

''ఇమేజేస్ గురించి ఆలోచించడానికి యిది సినిమా కాదండి జీవితం. విడిపోవాలనుకున్నాం. దానికి ఆయన యిన్‌డైరెక్టుగా హెల్ప్ చేశారు. అందుకు ఆయనకు థాంక్స్'' యిక యింటర్వ్యూ చాలన్నట్లు లేవబోయింది గాయత్రి.

''ఆఖరి ప్రశ్న మేడమ్ ఈ మూడు నెలల్లో ఒక్కసారి కూడా కేసుని వెనక్కు తీసుకోవాలని పించలేదా?''

నారాయణరావన్నాడు 'అనిపించడానికి అతనేమైనా జెంటిల్‌మేనా? అమ్మాయి మనసు విరిగిపోయింది అంతలా''

విలేకర్లు ఏదో అడగబోయారు.

''సెలవు''అని చేతులెత్తి దణ్ణం పెట్టాడు నారాయణరావు.

***

''మాకు ఆశ్చర్యంగా వుందిసార్. కేసు జరుగుతున్న యిన్నాళ్ళు మీరు మీడియాకి చిన్న అవకాశం యివ్వకుండా దూరంగా వుంటూవచ్చారు. ఇప్పుడూ మీరే మమ్మల్ని రమ్మన్నారు.'' టీవీ రిపోర్టర్ అడిగాడు.

కార్తికేయ యింట్లో ముందు హాలు మొత్తం మీడియాతో నిండిపోయింది.

''నా కోసం''

''అయితే యిన్నాళ్ళూ ఆమె మీద వేసిన అభియోగాలు మీరు కోర్టులో ఖండించక పోవడానికి కారణం.''

''ఆమె కోసం''


తికమకపడ్డారందరూ ''సార్...కొంచెం క్లియర్‌గా చెప్పండి?''

చిన్నగా నవ్వి అన్నాడు కార్తికేయ ''నేను క్లియర్‌గానే చెబుతున్నాను.

నా భార్యంటే నాకు చాలా యిష్టం. కేసు విషయమై అలా కోర్టుకు రావడం, అందరి దృష్టి ఆమె మీద పడటం నేను భరించలేక పోయాను. తను చాలా సెన్సిటివ్. పైకి గంభీరంగా వున్నా తట్టుకోలేదు. అందుకే కేసు తొందరగా ముగించేద్దామన్న వుద్దేశ్యంతోనే అంగీకరించాను.''

''మరిప్పుడు ఎందుకు చెబుతున్నారు?''

''చెప్పానుగా నాకోసం. నన్ను అభిమానించే వారి కోసం. అదే నేను కోర్టులో మాట్లాడితే వాదన అవుతుంది. భార్యాభర్తల మధ్య ఎలాంటి సమస్య అయినా వుండొచ్చు గాని, విడిపోదామన్న ఆలోచన రాకూడదు. అలాంటి ఆలోచన వచ్చినప్పుడు, వాదనలెందుకు? ఆర్గ్యుమెంట్స్‌తో ఏమీ సాధించలేం కదా?''



''మరిప్పుడు ఏం చెప్పాలని పిలిచారు?''

''నిజం''

హాలులో ఒక్కసారిగా నిశ్శబ్దం వ్యాపించింది. కాసేపు ఎవరూ మాట్లాడలేదు. కార్తికేయ అన్నాడు. ''చూశారా! నిశ్శబ్దం ఎంత హాయిగా వుందో? ఆ నిశ్శబ్దమే లోపించింది మా మధ్య.''

''ఎందుకో చెప్పగలరా?''

''అభిప్రాయ భేదాలని వివాదాలుగా సృష్టించుకోవడం వల్ల''.

నిట్టూర్చి చెప్పాడు కార్తికేయ '' ఈ వివాదాలకి ఎవరి ప్రమేయం లేకుండా అలా జరిగిపోయింది. ప్రపంచంలో అత్యంత బలమైనది బలహీనత. అలాంటి బలహీనత నాకూ వుంది. నిస్సహాయత దాని వెంటే కోపం, అసహనం.''

''మీకూ నిస్సహాయతా?''

నవ్వాడు కార్తికేయ '' ఏం వుండకూడదా? నేనూ మనిషినేనండి.''

''మా వుద్దేశ్యం...''

''అవును... నిస్సహాయతా, చిరాకుతో కూడిన అసహనం. వ్యక్తిగతమైన జీవితానికి దూరమైపోయాను. నేను నా కెరీర్ మొదట్లోనే ఆమెను వివాహం చేసుకున్నాను. తనని చేసుకున్న దగ్గర్నుంచి, అదృష్టమో దురదృష్టమో తెలీదుకాని, జీవితం అంతా బిజీగా మారిపోయింది. వృత్తి జీవితం వ్యక్తిగతమైన జీవితాన్ని డామినేట్ చేసి పారేసింది. మొత్తం కమిట్‌మెంట్స్‌తో నిండిపోయింది. నాకు తెలియకుండానే లోతుల్లోకి కూరుకుపోయాను. అయినా..మాది గ్లామర్ ఫీల్డ్‌కదండి...నవ్వుతూనే వుండేవాణ్ని.''

అందరూ అడగడం మర్చిపోయి ఆసక్తిగా వినసాగారు.

''ఇంటికి ఎప్పుడు వస్తున్నానో ఎప్పుడు వెళ్తున్నానో తెలియట్లేదు. మనిషికి మనిషి తోడుంటే, ఒంటరితనం పోతుంది. కాని నాకు తోడుగా వచ్చి పాపం ఒంటరిదైపోయింది. నేను చేసేది తప్పని నాకు తెలుసు. ఆ నిరాశా నిస్పృహలతోనే నన్ను నిలదీసేది. అసలే.. నాకు నేను సమాధానపరుచుకోలేని స్థితిలో వున్న నేను ఆ కోపం, అసహనం ఆమె మీదే చూపించేవాణ్ని.'' అని క్షణం ఆగాడు.

''బయట అందరితో ఎంతో సహనంగా, నవ్వుతూ వుండే నేను ఆమె ముందు అలా వుండలేకపోయాను.

దాంతో ఆమె అహం దెబ్బతినేది. మాటామాటా పెరిగేది. ఆమె సహనం కోల్పోయేది. ఫలితం నాకు యిష్టంలేని పనులు చేసేది.''

''తప్పు మీదే అని తెలిసినప్పుడు మీరు అనుగుణంగా మారివుంటే బావుండేది కదా?''

''నాకు తెలిసి నూటికి తొంభైశాతం మగవాళ్ళు సొసైటీలో జీవితంలో పైకి రావడానికి, పోరాడ్డానికి ఎంత నటించినా... ఇంట్లో మాత్రం నటించడు. ఎందుకంటే యిల్లు భార్యా మాత్రమే అతనికి స్వతంత్రం, స్వేచ్ఛ. ఆమెందుకు నన్ను అర్థం చేసుకోదు అనిపించేది. సరిగ్గా...యీ పాయింట్ దగ్గరే చాలా మంది లాగే మేము కూడా ఒకరినొకరం పోగొట్టుకున్నాం.''

మీడియా శ్రద్ధగా వింటోంది.

కార్తికేయ అన్నాడు ''ప్రపంచంలో చాలా రకాలుగా విడిపోయినవాళ్ళున్నారు. కట్నం కోసం, అక్రమ సంబంధాలు, పిల్లలు పుట్టలేదని, జూదం తాగుడికి బానిస అయిపోయి, యిలా..రకరకాలుగా సమస్యలతో విడిపోతున్నారు. వాటితో పోలిస్తే మాది చాలా చిన్న సమస్య''

''మరి దీనికి మార్గం ఎప్పుడూ ఆలోచించలేదా?''

''మార్గం వుంది. దానికి సర్దుకుపోవడం అంటారు. చిన్న చిన్న అడ్జస్ట్‌మెంట్స్‌తో జీవితం చాలా మధురంగా వుంటుంది. కాని అలా జరగలేదు. నువ్వా నేనా అన్నట్టే వుండేది. నేనే ఎప్పుడయినా సర్దుకుపోదామని వచ్చినా, గతంలో నేను అన్న మాటలను తను యింకా మర్చిపోలేక పెద్ద వాగ్వివాదం అయ్యేది. అలా...

జీవితం ఆశలతో కాక అహంతో బ్రతకాల్సి వచ్చింది.

దాంపత్య జీవితం అంటే ఆటకాదు. ఒకరు గెలవడం ఒకరు ఓడిపోవడం అనే ప్రశ్నే వుండకూడదు. ఒకర్ని గెలిపిస్తూ,యింకొకరు గెలవాలి. కాని చాలాసార్లు ఆమెను గెలిపించానుగాని నేనే మాత్రం గెలవలేదు. ఇప్పుడు... ఇప్పుడు కోర్టులో కూడా ఆమెనే గెలిపించాను.''

టీవీ రిపోర్టర్స్, ప్రెస్ రిపోర్టర్స్ అందరూ స్తబ్దుగా, స్థాణువులా చేస్తున్న పని ఆపి కన్నార్పకుండా చూస్తూండిపోయారు అతని వైపు.

కార్తికేయ చెప్పేది వాళ్ళ చేతుల్లోకి కాక మనసుల్లోకి చొచ్చుకు పోయింది.

అందిరి వైపు చూసి చిన్నగా నవ్వాడు కార్తికేయ ''మాది గ్లామర్ ప్రపంచం. గ్లామర్ కాపాడుకోడానికి, మా కెరీర్‌ని రక్షించుకోడానికి, మనసులో ఎన్ని అలజడులున్నా, భూకంపాలు వచ్చి జీవితాలు నిర్ధాక్షిణ్యంగా కూలిపోతున్నా రకరకాలుగా నటించాను. నా భార్య దగ్గర మాత్రమే నటించలేదు. అందుకే యీ... విడాకులు. ఇది చెబుదామనే పిలిచాను'' అని అందరికి సమస్కరించాడు కార్తికేయ.

వచ్చిన టీవీప్రెస్ రిపోర్టర్స్ గాఢంగా నిట్టూర్చి, మెల్లిగా ఒకొక్కరు బయటకు వెళ్ళారు.

కార్తికేయ ఒక్క నిమిషం మౌనంగా నిలబడి లోపలికి వెళ్ళబోయాడు...తన కాళ్ళను ఎవరో పట్టుకున్నట్టనిపించి చూశాడు.

తనను ఇంటర్వ్యూ చేసిన టీవీ రిపోర్టర్ ఏడుస్తూ ''థాంక్యూ వెరి మచ్ సార్'' అంది.

హతాశుడై ''అరెరె... ఎందుకమ్మా....లే'' అని లేపాడు కార్తికేయ.

కళ్ళు తుడుచుకుని అంది రిపోర్టర్ ''సరిగ్గా యిదే సమస్య రోజూ మా మధ్య రగులుతోంది సార్. మా వారు మెడికల్ కంపెనీలో మార్కెటింగ్ పర్సన్. నేను కూడా గాయత్రిగారి లాగే నిలదీసేదాన్ని. కాని తను మీలా చెప్పలేకపోయాడు.''

ఆశ్చర్యంగా చూశాడు కార్తికేయ.

''రోజూ మా మధ్య గొడవలు అవుతున్నాయి. దూరం పెరిగిపోయింది. తట్టుకోలేక నేను కూడా డైవర్స్‌కి అప్లయి చేద్దామనుకుంటున్నాను''

''సారీ...'' అన్నాడు కార్తికేయ చలించిపోయి.

'' ఇవ్వాళ మిమ్మల్ని ఈ విధంగా కలవడం నా అదృష్టం సార్. నాకిప్పుడు అర్థమైంది. లేకపోతే మా యిద్దరి మధ్య ఎవరూ పూడ్చలేని అగాథం ఏర్పడేది. థాంక్యూ సార్'' అంది కృతజ్ఞతగా.

సంతోషంగా అన్నాడు కార్తికేయ ''చాలా ఆనందంగా వుందమ్మా. నా అంతర్మథనం నిన్ను కదిల్చి నీ జీవితాన్ని నిలబెట్టినందుకు. బలహీనతల్ని భరించడం. తప్పుల్ని క్షమించడం మీ ఒక్కరి వల్లే అవుతుందమ్మా. చిన్న చిన్న సర్దుబాట్లు చేసుకుంటే, మొత్తం ఆనందమే...! ఎందుకంటే సుఖంగాని, దుఃఖంగాని మనం సృష్టించుకున్నవి. ఆనందం మాత్రమే నిజాయితిగా వచ్చేది. అల్ ది బెస్ట్.''

***

ఆ రోజు రాత్రి.

ఫోన్ మ్రోగింది. ఏదో ఆలోచిస్తూ వింటున్నాడే గాని, రిసీవర్ ఎత్తాలనిపించలేదు.

ఫోన్ మ్రోగడం ఆగిపోయింది.

అయిపోయింది. ఒక్కడే అయిపోయాడు. 'రెండ్రోజుల్లో తనకి, ఆమెకి బంధం తెగిపోతుంది. తను లేకుండా జీవితం... ఒంటరిగా...యిలా ఎన్నాళ్ళో... ఎన్నేళ్ళో....?'

మళ్ళీ ఫోన్ మ్రోగింది.

ఆలోచనల్లో వున్నవాడల్లా వులిక్కిపడి, విసుగ్గా రిసీవర్ ఎత్తి ''హలో'' అన్నాడు.

''హలో...నేను...గాయత్రిని '' మెత్తని గొంతు తడబడుతూ వినిపించింది.

నిటారుగా కూర్చున్నాడు కార్తికేయ.

''హలో... ఇందాక న్యూస్ బైట్‌లో మీరు మాట్లాడింది చూశాను.''

తను యీ మూడు నెలలు పడ్డ ఆవేదన, దుఃఖం మర్చిపోయాడు.

ఆమె గొంతు వినేసరికి దాని స్థానంలో ఉక్రోషం పొంగుకు వచ్చింది. పిచ్చికోపంతో అన్నాడు ''నీకసలు బుద్ధుందా? ఏం ముఖం పెట్టుకుని చేశావు ఫోన్...చేసింది చాల్లేదా....?''

వింటున్న గాయత్రి ఒక్కసారి వులిక్కిపడి ''నేను...చెప్పేది...''

''ఏమిటి నువ్వు నాకు చెప్పేది? అంటే...నువ్వు లేకుండా బ్రతకలేక నువ్వు చెప్పినట్టు వుంటాననుకున్నావా కోర్టుకు వెళితే?...నన్ను వదిలి ఎలా సుఖంగా బ్రతుకుతావో చూస్తాను. నా పరువు తీశావు కదే...రాక్షసి'' కసిగా నోటికి వచ్చినట్టు తిట్టాడు కార్తికేయ.

అవతల వింటున్న గాయత్రికి చిత్రంగా యీసారి కోపం రాలేదు కార్తికేయ మాటలకు.

తెరలు తెరలుగా నవ్వు వచ్చింది. పడి పడి నవ్వసాగింది.

కార్తికేయ ఆవేశంగా ఫోన్‌లో ఆమెను తిడుతూనే వున్నాడు.

గాయత్రి నవ్వుతూనే వుంది.

*

## పాత సీసాలో కొత్త సారా...



పాత సీసాలో కొత్త సారా చందంగా ఇప్పుడు చాలా సినిమాలు వస్తున్నాయి. పాత సినిమాలను పునర్మించడం. వాటికి ప్రేక్షకాదరణ లభించడం మామూలే! ఈ కోవలోనే రానున్నది 'జగన్మోహిని'. విఠలాచార్య దర్శకత్వంలో జయమాలిని, నరసింహరాజు నటించిన ఈ చిత్రం గతంలో ఘనవిజయం సాధించిన విషయం గుర్తుండే వుంటుంది. ఆ విజయాన్ని దృష్టిలో పెట్టుకునే తమిళం, తెలుగు భాషలలో దీనిని పునర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు. విశ్వనాథన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో 'నమిత' జయమాలిని పాత్రను పోషిస్తుండగా రాజా, మీరా చోప్రా తదితరులు నటిస్తున్నారు.